అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు: ఎమ్మెల్యే శ్రీగణేశ్


ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్పీలు

అడ్డగుట్ట: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రిసోర్స్ పర్సన్స్(ఆర్పీలు) ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను తుకారాం గేట్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆర్పీలు మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్స్‌లో చాలా మంది పేదవాళ్లు ఉన్నారని, కనీసం ఇంటి అద్దె కట్టడానికి కూడా కష్టమవుతుందన్నారు. ప్రభుత్వం పేదలకు కేటాయించే డబుల్ బెడ్రూం ఇళ్లను తమకు కూడా ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేస్తుందని, ఆ ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని చెప్పారు.

పీసీసీ అధ్యక్షుడికి బయోడేటా అందజేత


మహేశ్‌కుమార్ గౌడ్‌కు బయోడేటా అందజేస్తున్న శివ

లాలాపేట: కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న తన సేవలను, వ్యక్తిగత వివరాలను తెలియజేసేలా రూపొందించిన బయోడెటాను మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించి గుర్తింపును ఇవ్వాలనీ కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించి పీసీసి అధ్యక్షుడు తన అభ్యర్థనను పరిశీలిస్తామని చెప్పినట్లు శ్రీరామ్ శివకుమార్ తెలియజేశారు.

ఆకట్టుకున్న ఎన్‌సీసీ మ్యూజికల్ బ్యాండ్


మిలిటరీ అధికారులతో తక్షశిల పాఠశాల బ్యాండ్ విద్యార్థులు

లాలాపేట: నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ)74వ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల మెహిదీపట్నం మిలిటరీ గారిసన్‌లో నిర్వహించిన వేడుకల్లో శాంతినగర్ తక్షశిల పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన మ్యూజికల్ బ్యాండ్ (సంగీత ప్రదర్శన) ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎయిర్ కమాండో వి.ఎం.రెడ్డి ఆ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కల్నల్ అనిల్‌కుమార్ యాదవ్, లెఫ్టినెంట్ కల్నల్ కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి-సీతాఫల్‌మండి ట్రాక్‌పై భద్రతా తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మంగళవారం మల్కాజిగిరి – సీతాఫల్ మండి సెక్షన్‌లో భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సెక్షన్‌లో ట్రాక్‌ల భద్రతను మరింతగా పటిష్టం చేయాలని, నిర్ణీత సమయంలో భద్రతా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జనరల్ మేనేజర్ అధికారులకు సూచించారు. ఆలుగడ్డ బావి జంక్షన్ సమీపంలో రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణంతో సహా డబ్లింగ్ పనులను విజయవంతంగా పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు.

వదంతులను నమ్మొద్దు: ఏసీపీ

అమీర్‌పేట: ప్రజలు వదంతులను నమ్మవద్దని ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. మంగళవారం ఎస్ఆర్ నగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పీస్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ఆకతాయిలు దేవాలయాలు, ప్రార్థన మందిరాల వద్ద అలజడులు సృష్టించేందుకు యత్నిస్తుంటారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పీస్ కమిటీ సభ్యులు ఉన్నారు.

'కిమ్స్ సన్‌షైన్' లో కార్టిలేజ్ షోల్డర్ రిపేర్

సనత్‌నగర్: సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్‌లోని షోల్డర్ సర్జరీ విభాగం, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ వైద్యులు కలిసి ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ షోల్డర్ రిపేర్ అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. బేగంపేటకు చెందిన 25 ఏళ్ల యువకుడు బాస్కెట్‌బాల్ ఆడుతుండగా భుజానికి గాయమైంది. దీంతో అతడు కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో చేరాడు. హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ రిపేర్ సర్జరీని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ చీఫ్ షోల్డర్ సర్జన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ నేతృత్వంలో వైద్యులు విజయవంతంగా చేశారు. విప్లవాత్మకమైన కొండ్రో పిల్లర్ సాంకేతికతను ఉపయోగించి శస్త్ర చికిత్స పూర్తి చేశారు. అనంతరం రోగి ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. భుజంలో కార్టిలేజ్ రిపేర్ శస్త్ర చికిత్స అత్యంత సవాళ్లతో కూడుకున్నదన్నారు. ఇలాంటి సమస్యలకు సాంప్రదాయ చికిత్స ద్వారా తాత్కాలిక ఉపశమనం మాత్రమే దొరుకుతుందన్నారు. ఈ చికిత్స తర్వాత రోగి వేగంగా కోలుకోవడంతోపాటు మెరుగైన ఫలితాలు ఉంటాయని, ఈ శస్త్ర చికిత్స కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్‌లో అరుదైన శస్త్ర చికిత్సగా డాక్టర్ పేర్కొన్నారు.

ఆర్టీఏ కార్యాలయ పునర్‌నిర్మాణానికి కృషి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ ఆర్టీఏ కార్యాలయాన్ని ఆధునిక హంగులతో పునర్‌నిర్మించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా రోడ్డు విస్తరణలో 75 శాతానికిపైగా భవనాన్ని తొలగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆర్టీఏ కార్యాలయాన్ని సందర్శించారు. 3 ఎకరాలలో భవన నిర్మాణం చేపట్టేలా త్వరలోనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రిని కలిసి విన్నవిస్తానన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్టీఓ స్వామి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జయ చందర్, నరసింహస్వామి, అవినాష్ ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవాలు

భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న అమలులోకి వచ్చిన సందర్భంగా సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్ నగర్ నియోజకవర్గాల పరిధిలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషిని పలువురు స్మరించుకున్నారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలపై ప్రతిజ్ఞలు చేశారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వర్ధిల్లాలని నినదించారు. పలుచోట్ల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రాజ్యాంగ దినోత్సవం ప్రాముఖ్యతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

– సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ల బృందం


కంటోన్మెంట్ పరిధిలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నేతలు


విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం


గాంధీ భవన్‌లో టీపీసీసీ హైదరాబాద్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ కిషన్‌రాజ్ చౌహాన్


ఐడీహెచ్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన శ్రీనివాస్


లాలాపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు


అన్నానగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉత్సవాల్లో పాల్గొన్న టీఎన్ శ్రీనివాస్


కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ భీమయ్యగౌడ్


ప్రతిజ్ఞ చేస్తున్న టీజీపీసీబీ ఉద్యోగులు


తార్నాక చింతల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పిస్తున్న బస్తీ నాయకులు


రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించిన కార్మికులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట: లాలాగూడ, ఐబీసీటీ సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నాగార్జుననగర్ ఫీడర్ పరిధిలోని సండే మార్కెట్, నాగార్జున నగర్, షిర్డీసాయినగర్, శ్రీనివాస్ అపార్ట్‌మెంట్ పార్క్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దాల్‌మిల్ ఫీడర్ ప్రాంతంలోని దాల్‌మిల్, గుడిమెల్ల విల్లా, నాగార్జున కమ్యూనిటీహాల్, అప్పారావు పీటీ, విశాలి అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అపరాజిత కాలనీ, సాద్రైత్ మంజిల్, ఎంసీహెచ్ మార్కెట్, ఎస్ఆర్‌టీ కాలనీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనివాస టవర్స్, అమోఘ ప్లాజా, మేటాస్, బ్లూ మూన్ హోటల్, మనీల్యాండ్ చైనా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

సైనికుల ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపర్చాలి


సైనికులతో మాట్లాడుతున్న లెఫ్టినెంట్ జనరల్ కరణ్‌బీర్ సింగ్ బ్రార్

రసూల్‌పురా: దేశభద్రతకు నిరంతరం పాటుపడే సైనికులకు, వారి కుటుంబాలకు అందించే ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల్లో నిరంతరం మెరుగుదల అవసరమని లెఫ్టినెంట్ జనరల్ దక్షిణ భారత ప్రాంత జనరల్ ఆఫీసర్ కమాండింగ్ కరణ్‌బీర్ సింగ్ బ్రార్ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా(టాసా) ఆధ్వర్యంలోని మిలిటరీ శిక్షణ కేంద్రాలు, మిలిటరీ ఆసుపత్రిని ఆయన మంగళవారం సందర్శించారు. టాసా ఆధ్వర్యంలో శిక్షణ సంస్థల కార్యాచరణ, శిక్షణ, పరిపాలన సామర్థ్యం ఉన్నత ప్రమాణాలను నిర్వహించడంపై సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు సైనికులతో పలు అంశాలపై మాట్లాడి వారి అంకితభావాన్ని, నిబద్ధతను అభినందించారు. సైనిక దళాల సంక్షేమం, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడానికి బ్రార్ పర్యటన తోడ్పాటునందిస్తుందని, టాసా అనుబంధ సంస్థలపై పరిపాలన ప్రభావాన్ని పెంచుతుందని అధికారులు వెల్లడించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: తలసాని


స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: చదువుతోపాటు క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. సనత్‌నగర్‌లోని లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులకు మూడు రోజులపాటు నిర్వహించే స్పోర్ట్స్ మీట్‌కు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌కు 100 పాఠశాలలకు చెందిన సమారు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంత సమయం క్రీడలకు వెచ్చించడం ద్వారా ఉత్సాహంగా ఉండటమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రికెట్, ఖోఖో, చెస్, వాలీబాల్, ఫుట్‌బాల్ వంటి ఆసక్తి కలిగిన క్రీడల్లో రాణించాలని సూచించారు. ఉత్తమ విద్యాబోధన చేయడంతో పాటు విద్యార్థులను క్రీడల్లో కూడా ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎంఏ ప్రతినిధులను అభినందించారు. గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాలకు తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత కొలను బాల్‌రెడ్డి, నిర్వాహక కమిటీ సభ్యులు ప్రశాంత్, అగస్టీన్, సుధాకర్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, ప్రసాద్, కుతుబుద్దీన్, సీత పాల్గొన్నారు.

దైవదర్శనానికి చుక్కాల ఫౌండేషన్ సాయం


తిరుపతి దర్శనం చేసుకునేందుకు వెళుతున్న వికలాంగులు

సికింద్రాబాద్: తిరుపతి దైవ దర్శనం చేసుకునే పరిస్థితి లేని పలువురికి శ్రీ అష్టోత్తరశత చుక్కాల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అండగా నిలిచారు. ఆర్థిక స్తోమత లేనివారు, అనాథలు, వికలాంగులు మొత్తంగా 400 మందిని చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మంగళవారం తిరుపతి తీసుకువెళ్లారు. ట్రస్టు ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వేణు చుక్కాల నేతృత్వంలో మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రైలులో తిరుపతి దైవదర్శనం కోసం బయలుదేరి వెళ్లారు. రైల్వేస్టేషన్‌లో భక్తులకు బీఆర్ఎస్ నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ తదితరులు వీడ్కోలు పలికారు.

సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొ.గంగాధర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీ నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొ.గంగాధర్ నియమితులయ్యారు. సైన్స్ కాలేజీ కెమిస్ట్రీ విభాగానికి చెందిన గంగాధర్ పీజీ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. లా కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ ప్రొ.రాధిక ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో న్యాయశాస్త్రం విభాగానికి అడిషనల్ కంట్రోలర్‌గా నియమితులయ్యారు.

రాజ్యాంగాన్ని సృజనాత్మకంగా అమలు చేయాలి


చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

లాలాపేట: ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రాసినప్పటికీ దానిని సృజనాత్మకంగా ఉపయోగించుకోవడం ద్వారా భవిష్యత్‌లో తలెత్తే సమస్యలకు పరిష్కారాలను చూపించవచ్చని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం అన్నారు. లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తార్నాకలో జరిగిన 'రైతులు– రాజ్యాంగం, భూమి సంవాద్' అనే చర్చా కార్యక్రమంలో కోదండరాం మాట్లాడారు. నేటి వ్యవసాయరంగ సమస్యలను రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను అన్వయించుకోవడం, కొత్త భాష్యం చెప్పడం ద్వారా పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందన్నారు. రాజ్యాంగాన్ని ఇప్పటికిప్పుడు సవరించుకోవాల్సిన అవసరం ఏమి లేదని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా భూమి–రైతు, గౌరవ ప్రదమైన వ్యవసాయ సమస్యలపై ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, పలువురు నిపుణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ డిమాండ్


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: పేదల సంక్షేమం కోసం వివిధ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని వెంటనే అమలు చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం మధురానగర్ కమ్యూనిటీహాలులో జరిగింది. ఈ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. పద్మారావుగౌడ్ మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం నగదుతోపాటు తులం బంగారం అందిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీ ఏమైందని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారని అన్నారు. కాగా, కార్యక్రమానికి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, షకీల్‌ఖాన్, అనిల్ కుమార్, వహీదుద్దీన్ తదితరులు తమపార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్నలక్ష్మిశ్రీనివాస్, రాసూరి సునీత, కంది శైలజ, నాయకులు ఆలకుంట హరి, కరాటే రాజు, కంది నారాయణ, లింగాని శ్రీనివాస్, తహసీల్దార్లు భూపతి గౌడ్, ప్రతాప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి అందజేత

నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫలమండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అడ్డగుట్టకు చెందిన సువర్ణకు వైద్య సహాయం నిమిత్తం రూ. 2 లక్షలు, మెట్టుగూడకు చెందిన అభినాష్‌కు రూ.60 వేల సీఎం సహాయ నిధి నుంచి నిధుల మంజూరు పత్రాల(ఎల్‌ఓసీ)ను మంగళవారం అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ,రాసూరి సునీత రమేష్, లింగాని ప్రసన్న లక్ష్మిశ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తీగుల్ల రామేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.41, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 33, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 26, పందిరి బీర 45, క్యాబేజీ 26, క్యారెట్ 60, దొండ 35, గుండుబీన్స్ 47, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 22, దోసకాయ 28, బీట్‌రూట్ 50, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 39, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూలో రాజ్యాంగ దినోత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. క్యాంపస్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ఓయూ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ న్యాయకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మడి అనురాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి లూధియానా వర్సిటీ ప్రొ. జగ్‌మోహన్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం పూలమాల వేసి రాజ్యాగం గురించి మాట్లాడారు. క్యాంపస్‌లోని లా కాలేజీలో బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

శుభాకాంక్షలు



సనత్‌నగర్: ఆయుష్ డైరెక్టర్‌గా నియమితులైన చిట్టెం లక్ష్మీరెడ్డిని తెలంగాణ నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్ఆర్‌హెచ్ఎం) మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు రాజ్‌మోహన్, వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు శాంత్‌కుమార్, స్వప్న, వీణ, శృతి తదితరులు లక్ష్మీరెడ్డిని ఆమె నివాసంలో కలిసి శుభాభినందనలు తెలిపారు.

జలమండలి కాంగార్ యూనియన్‌లో చేరికలు



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఆరో డివిజన్ ఫతేనగర్ సెక్షన్ కార్మికులు పలువురు మంగళవారం 'జలమండలి కాంగార్ యూనియన్'లో చేరారు. జలమండలి యూనియన్ నాయకుడు శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో కాంగార్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామరాజు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్ సురేష్ బాబు నాయకత్వాన్ని బలపరుస్తూ కార్మికులు యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఎస్ఎంఆర్ ఏరియర్స్ విడుదలకు కృషి చేసిన కాంగార్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనను ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులోనూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని యూనియన్ నేతలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ హెల్త్ కార్డులు, ప్రమోషన్లు తదితర డిమాండ్లను అంగీకరించేలా ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. వచ్చే నెలలో జరగబోయే జలమండలి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ జలమండలి కాంగార్ యూనియన్‌కు ఓటు వేసి గెలిపించాలని రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

గంజాయి రవాణా.. ఇద్దరు సోదరుల రిమాండ్

18 కిలోల గంజాయి స్వాధీనం


బెంగాల్ సోదరుల గంజాయి రవాణాను వివరిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇద్దరు సోదరులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.4,50 లక్షల విలువ చేసే 18 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్ కథనం ప్రకారం... సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లపై ఇన్‌స్పెక్టర్ బి.సాయిశ్వర్‌గౌడ్ నేతృత్వంలో జీఆర్పీ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 2వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదంగా లగేజీతో తచ్చాడుతున్న ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. పశ్చిమబెంగాల్ రాష్ట్రం హుగ్లీకి చెందిన ప్రీతమ్‌చౌదరి(37), సత్యంచౌదరి(29) ఇరువురు సోదరులు. ముంబై సీఏడబ్ల్యూ క్లబ్‌లో కుక్‌లుగా పనిచేస్తున్న సమయంలో గంజాయికి బానిసయ్యారు. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డ ఇరువురు సోదరులు గంజాయి విక్రయదారులతో స్నేహం పెంచుకున్నారు. క్రమేణా గంజాయి రవాణాదారులుగా మారి డబ్బు సంపాదించడమే వృత్తిగా చేసుకున్నారు. ఇందులో భాగంగా షాలీమార్ టౌన్‌కు చేరుకున్న వీరిరువురు 18 కిలోల గంజాయిని కొనుగోలు చేసి ముంబైకి తరలించేందుకు ఉపక్రమించారు. వివిధ రైళ్లలో ప్రయాణిస్తూ సికింద్రాబాద్‌కు గంజాయితో చేరుకున్న ఇరువురు సోదరులు పోలీసులకు పట్టుబడ్డారు.

విదేశాల్లో వర్క్ వీసాలిప్పిస్తానని మోసం

అమీర్‌పేట: విదేశాల్లో ఉద్యోగాల కోసం వీసాలిప్పిస్తానని నమ్మించి ఓ కన్సల్టెన్సీ నుంచి డబ్బులు దండుకున్న నకిలీ డిప్యూటీ కలెక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా నల్లగండ్లకు చెందిన దండా చంద్రబాబు అమీర్‌పేట ధరంకరం రోడ్డులో మన్నెం సర్వీసెస్ పేరిట ఓవర్సీస్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. కాగా, ఇటీవల చింత సురేష్ అనే వ్యక్తి తాను డిప్యూటీ కలెక్టర్‌ను అంటూ పరిచయం చేసుకున్నాడు. విదేశాల్లో తనకు చాలా పలుకుబడి ఉందని, వర్క్ వీసాలు తేలిగ్గా ఇప్పిస్తానని నమ్మించాడు. తన వెంట శంకర్ పట్నాల అనే మిత్రుడిని తీసుకువచ్చాడు. కన్సల్టెన్సీకి వచ్చే వ్యక్తుల వివరాలను ఇస్తే వీసాలు ఇప్పిస్తామని చెప్పారు. ఇందుకోసం కన్సల్టెన్సీ నిర్వాహకుడు చంద్రబాబు వద్ద రూ.8.5 లక్షలు ఒక సారి, మరో రెండుసార్లు రూ.2 లక్షల చొప్పున వసూలు చేశాడు. మరింత డబ్బుల కావాలని డిమాండ్ చేయడంతో చంద్రబాబు అనుమానించి, తాను ఇదివరకు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. సురేష్ డబ్బులు ఇవ్వకపోగా దుర్భాషలాడుతూ బెదిరించడంతో చంద్రబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.